ఆర్థిక సాయం

కీసర: గోధుమకుంటలో నివసించే కట్ట లక్ష్మి మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ కుమారుడు వంగేటి పర్వత్ రెడ్డి బుధవారం లక్ష్మి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఆమె అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు.

రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హరిబాబురెడ్డి

మేడ్చల్: రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మేడ్చల్‌కు చెందిన హరిబాబురెడ్డి నియమితులయ్యాడు. హరిబాబురెడ్డిని ఐక్యవేదిక అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి నియమించి నియామకపత్రాన్ని అందజేశారు. పేద రెడ్డిల సమస్యలపై నిరంతరం పోరాటం చేసి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

ఘనంగా ‘కేవీపీఎస్’ ఆవిర్భావ వేడుకలు



ఘట్‌కేసర్: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో కేవీపీఎస్ 28వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బుధవారం కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేవీపీఎస్ రాష్ట్ర నాయకురాలు సబిత, జిల్లా నాయకుడు యాదయ్య మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడా లేని అసమానతలు కులం రూపంలో దేశంలో కొనసాగుతున్నాయని, వీటివల్ల దేశం వెనకబడి పోయిందన్నారు. భవాని, రజిత, మాలిని, సత్తమ్మ, సరిత, మాధవి, లక్ష్మి, రేణుక పాల్గొన్నారు.

‘కేపీఆర్ఐటీ’ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



ఇమామ్ అలీని అభినందిస్తున్న అధ్యాపకులు

ఘట్‌కేసర్: ఘనాపూర్ కేపీఆర్ఐటీ (కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల) అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇమామ్ అలీకి గౌరవ డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి చైర్మన్ కొమ్మూరి ప్రతాపరెడ్డి, వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, స్ట్రాటజీ డైరెక్టర్ కొమ్మూరి దివ్యశ్రీ, డైరెక్టర్ ప్రొఫెసర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌కశ్యప్, ఈసీఈ విభాగాధిపతి విశ్వశ్రీ, అధ్యాపకులు ఆయనను బుధవారం అభినందించారు.

ఎస్సీ శ్మశానవాటికకు నిధులు కేటాయించాలి



కీసర: అసంపూర్తిగా ఉన్న ఎస్సీ శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని బీజేపీ నేతలు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి ఆయన స్పందించి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. నేతలు జిల్లాల తిరుమలరెడ్డి, మెట్టు కృష్ణయాదవ్, కృష్ణ, సుధాకర్, మహేందర్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్, శ్రీనివాస్, రవీందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు వ్యాక్సినేషన్

పోచారం: కుక్కల బెడదపై పోచారం మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రజలు ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. బుధవారం వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ చేశారు. జూబ్లీహిల్స్‌లోని బ్లూక్రాస్ సొసైటీకి చెందిన ప్రవళిక, కుమారిల సహకారంతో వ్యాక్సినేషన్ చేశామన్నారు. వాహనదారులు, స్కూల్ పిల్లలపై వీధి కుక్కలు దాడి చేస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాయిరాజు, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ సాయితేజ, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట ఇద్దరి బైండోవర్

ఘట్‌కేసర్: ఇద్దరు యువకులను ఘట్‌కేసర్ పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. బుధవారం ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. అవుషాపూర్ గ్రామానికి చెందిన సన్నీ అలియాస్ మణిదీప్‌రెడ్డి (23), టింకు అలియాస్ శ్రీకర్‌రెడ్డి (31)లు స్థానికంగా ఓ టిఫిన్ సెంటర్‌లోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. హోటల్ సిబ్బందిపై దాడిచేసి కస్టమర్లను భయభ్రాంతులకు గురిచేశారు. ఇలాంటి ఘటనల్లో వీరు గతంలో నిందితులుగా ఉన్నారు. ఇటీవల జరిగిన గొడవల్లో వీరి ప్రమేయం ఉండటంతో తహసీల్దార్ డీఎస్ రజనీ ఎదుట ప్రవేశపెట్టారు. నిందితుల నుంచి బాండ్ తీసుకున్నారు. చట్టవిరుద్ధమైన కార్యకలాపాల్లో పాల్గొనడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తిప్పలు తప్పేదెలా ?



నాగారం-కుషాయిగూడ ప్రధాన రహదారిపై వరద ఉధృతి (ఫైల్)

వర్షం పడితే జలదిగ్బంధంలో కాలనీలు

- తీవ్ర ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి

కీసర: వర్షం కురిసిందంటే చాలు నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో పలు కాలనీలు నీట మునిగాల్సిందే. కాలనీల్లో ఇళ్ల మధ్య నుంచి పెద్ద ఎత్తున వరదనీరు ప్రవహిస్తుండటంతో ఆ కాలనీల్లో నివసించే ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఒక్కసారి భారీవర్షం పడిదంటే చాలు కాలనీల్లో వరద నీరు రోజుల తరబడి ప్రవహిస్తుండటంతో ఒక్కోసారి ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంటుంది.

జలమయమైన లోతట్టు ప్రాంతాలు..

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నాగారం, దమ్మాయిగూడలోని చెరువులు, కుంటలు పొంగి పొర్లిపోయి లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. వర్షాలు కురిసిన సమయంలో ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద నీరు రావడంతో నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి చౌరస్తా వద్ద వరద పరిస్థితి మరింత అధ్వానంగా తయారవుతోంది.



జలదిగ్బంధంలో కాలనీ (ఫైల్)

నరకం చూస్తున్న ఉద్యోగులు, విద్యార్థులు..

ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూల్ విద్యార్థులు, ఉద్యోగస్తులు నరకం అనుభవిస్తున్నారు. గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడం వల్ల ప్రజలు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

- రాంపల్లి చౌరస్తా దిగువ ప్రాంతాలైన దాయర కుంట సమీపంలోని బీఎంఆర్‌కాలనీ, అరవింద్‌నగర్, సాయిసంజీవ, ఎస్సీ బీబీసీకాలనీ, శ్రీరత్నకాలనీ, కాలనీల రహదారులు పూర్తిగా నీటిలో మునిగిపోవడంతో ఆయా కాలనీల్లో నివసిస్తున్న ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు.

వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు..

వరదనీరు సాఫీగా దిగువ ప్రాంతంలో చర్లపల్లి చెరువులోకి వెళ్లేలా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. రాంపల్లి చౌరస్తా నుంచి ప్రధాన రహదారి వెంబడి నాగారం పెద్ద కప్పు వద్ద గల అన్నరాయిని చెరువు నీరు వెళ్లే నాలాలో ఈ నీటిని కలిపే విధంగా పైపులైన్ పనులు చేపట్టాలని లోతట్టు కాలనీవాసులు, వరదముంపు కాలనీల జేఏసీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

- గత ప్రభుత్వ హయాంలో వరద నీటి కష్టాలు తీర్చేందుకు దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో అప్పటి మంత్రి మల్లారెడ్డి చేపట్టిన స్ట్రీమ్ వాటర్ పైపులైన్ పనుల వల్ల దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో లోతట్టు కాలనీలో వరదనీటి కష్టాలు 80 శాతం మేర పరిష్కారం లభించింది.
- నాగారం మున్సిపల్ పరిధిలో స్ట్రీమ్ వాటర్ పైపులైన్ పనులు పూర్తికాకపోవడంతో వరదనీటి కష్టాలు తప్పడం లేదు. వర్షాలు కురిసిన సమయంలో అధికారులు, పాలకులు తాత్కాలికంగా చర్యలు చేపట్టడం వల్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.
- రాంపల్లి చౌరస్తాలో ప్రధాన రహదారిలో వరద నీరు వెళ్లేందుకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, ఇప్పటికైనా అధికారులు స్పందించి నాగారం, దమ్మాయిగూడ రెండు మున్సిపాలిటీల పరిధిలో వరదనీటి కష్టాలను తొలగించేందుకు శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నాగారం - కుషాయిగూడ రహదారిపై ట్రా‘ఫికర్’..

వరద ప్రవాహం ఉన్న సమయంలో నాగారం - కుషాయిగూడ ప్రధాన రహదారి మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. వరదనీటి కారణంగా ఇటు ఐకాం, అటు చక్రపురం వరకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



రాంపల్లి చౌరస్తాలో ట్రా‘ఫికర్’ (ఫైల్)

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరీ

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఈనెల 12న జరిగే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా అమలు చేయడానికి అవసరమైన ప్రణాళికలు, ఏర్పాట్లు చేసుకుని సమన్వయంతో ముందుకు సాగాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉమాగౌరీ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల జిల్లా అధికారులతో టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 0–5 ఏళ్ల లోపు ఉన్న 5,24,973 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ వివరించారు. ఇందు కోసం జిల్లాలో మొత్తంగా 1,125 పోలియో బూత్‌లు, 31 మొబైల్ టీమ్‌లు, 31 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కౌశిక్, ప్రోగ్రామ్ అధికారులు డా. మహేశ్వరి, డా.చంద్రకళ, శ్రీదేవి, సత్యవతి, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి సాంబశివరావు, జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి శారద, జిల్లా విద్యాధికారి విజయకుమారి, జిల్లా పబ్లిక్ రిలేషన్ అధికారి స్వర్ణలత, మెప్మా అధికారి అనిల్ సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం



కీసర: కీసర గోధుమకుంటలోని యూకే బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ బయ్యారపు సురేందర్‌వర్మకు నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు–2025 లభించింది. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ‘ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) అధ్వర్యంలో నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. సురేందర్‌వర్మ 2007 నుంచి లెక్చరర్‌గా పనిచేస్తూ.. 2015లో ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎడ్యుకేషన్‌లో డాక్టరేట్ పొంది జాతీయ, అంతర్జాతీయ సెమినార్స్‌లో పాల్గొని గణిత బోధన పద్ధతులు పుస్తకాలను రచించి బోధన వృత్తి ద్వారా సమాజ శ్రేయస్సు పట్ల చేస్తున్న కృషిని గుర్తించి ఏఐసీఎఫ్ ఈ అవార్డును ప్రదానం చేసిందన్నారు. ఈ మేరకు కళాశాల యాజమాన్యం డైరెక్టర్ ఉదయ్‌కుమార్, కరెస్పాండెంట్ డాక్టర్ విద్యుల్లవంతిలు ఆయనకు అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పోచారం: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందుకు చెందిన చింతబోయిన వెంకన్న (48) పోచారం ఓల్డ్ విలేజ్‌లో నివాసం ఉంటూ.. ఘట్‌కేసర్‌లోని ఓ బ్రిక్స్ కంపెనీలో జీప్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండ్రోజుల క్రితం వివేక్ అనే వ్యక్తి సెల్‌ఫోన్ కనిపించకపోవడంతో వెంకన్న తీసినట్లు అతడు అనుమానించారు. దీంతో మరో వ్యక్తి మల్లేష్‌తో కలిసి అతడిని ఆటోలో తీసుకెళ్లి ఫోన్ గురించి ఆరా తీసినట్లు సమాచారం. అనంతరం అన్నానగర్ కు తీసుకెళ్లగా.. అక్కడకు చేరుకోగానే వెంకన్న అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో అతడిని చికిత్స కోసం ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వదిలివెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అతడు బుధవారం రాత్రి అతడు మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దాడి జరిగిందా.. అనారోగ్య కారణాలున్నాయా.. ? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో విద్యార్థుల అదృశ్యం



రంగతేజస్వి



గట్టు సాత్విక్‌రెడ్డి

ఘట్‌కేసర్: డిగ్రీ చదువుతున్న ఓ విద్యార్థిని ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అదృశ్యమైంది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన సాదు రంగతేజస్వి (19) పట్టణంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతోంది. బుధవారం ఉదయం 9 గంటలకు కళాశాలకు వెళ్తున్నానని చెప్పి, సాయంత్రమైన తిరిగి రాలేదు. దీంతో ఆమె తండ్రి రాజేష్‌కుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరోచోట బీటెక్ విద్యార్థి..

ఘట్‌కేసర్: కళాశాలకు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లిన ఓ బీటెక్ విద్యార్థి అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌కు చెందిన గట్టు సాత్విక్‌రెడ్డి (21) అవుషాపూర్‌లోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతూ.. వసతిగృహంలో ఉంటున్నాడు. దసరాకు ఇంటికి వెళ్లిన అతడు తిరిగి వసతి గృహానికి వచ్చాడు. ఈ క్రమంలో 6న కళాశాలకు వెళుతున్నానని వసతి గృహం నుంచి బయటకు రాగానే ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. సాయంత్రం వరకు వసతి గృహం, ఇంటికి చేరుకోలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు..

వ్యక్తి దుర్మరణం



మృతిచెందిన శంకర్

ఘట్‌కేసర్: బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో బైక్ నడుపుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీలోని బొక్కొనిగూడలో నివాసం ఉంటున్న నాగర్‌కర్నూల్‌కు చెందిన చంద్రకంటి శంకర్ (35) అవుషాపూర్ హెచ్‌పీసీఎల్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం బొక్కినగూడలోని ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా హెచ్‌పీసీఎల్ గేటు ముందుకు రాగానే టాటా ఇంట్రా కారు నడుపుతున్న కొండాపూర్‌కు చెందిన ఎదురుగొట్ల స్వామి వేగంగా బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శంకర్ తల, కాళ్లకు తీవ్ర గాయాలుకాగా.. స్థానికులు గమనించి వెంటనే పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల తనిఖీలు



వాహన తనిఖీల్లో ఏసీపీ శంకర్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్‌లో మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బుధవారం శివాజీ విగ్రహం సమీపంలో వాహన తనిఖీలు చేపట్టగా.. ఏసీపీ పాల్గొని పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనాలు, పెండింగ్ చలాన్లు, డ్రంకన్ డ్రైవ్ పరిశీలించారు. ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, నిబంధనలు పాటించకపోవడం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఐ కిరణ్, ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, అధ్యాపకులు, విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి ఘనాపూర్‌లోని మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ వారోత్సవాలు జరిగాయి. ఆపదలు, ప్రమాదాలు, విపత్తుల సందర్భంగా ‘మానసిక ఆరోగ్యాన్ని అందించడం ఎలా’..? అనే అంశంతో ఈనెల 4న ప్రారంభమైన వారోత్సవాల్లో భాగంగా పలు అవగాహన కార్యక్రమాలు, వైద్య విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. బుధవారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సూర్యప్రభ విపత్తులు సంభవించినప్పుడు మానసిక రోగులకు చికిత్స అందించడంపై అవగాహన కల్పించారు. కళాశాలకు చెందిన పీజీ విద్యార్థిని స్ఫూర్తి ఇటీవల కామారెడ్డిలో సంభవించిన భారీ వరదల సందర్భంగా మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా స్థానికంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించి విద్యార్థులకు వివరించారు. అనంతరం వైద్య విద్యార్థులకు పోస్టర్, ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు ప్రిన్సిపాల్ దేవేంద్రసింగ్ నేగి బహుమతులు ప్రదానం చేశారు. ఈనెల 10 వరకు వైద్య విద్యార్థులకు మరిన్ని పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఎమ్ఐఎమ్ఎస్ ప్రెసిడెంట్ శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ దేవేంద్రసింగ్ నేగి, వైస్ ప్రిన్సిపాల్ శైలేంద్ర, అనురాగ్ శ్రీవాత్సవ, సూర్యప్రభ, ఈనాక్షి, మృదుల, వైద్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలని ధర్నా

మేడ్చల్: పట్టణంలో రోడ్డు సరిగ్గా లేకపోవడంతో తమ గ్రామానికి బస్సులు రావడం లేదని, రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రోడ్డు సౌకర్యం లేక విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే హౌజింగ్‌బోర్డు కాలనీ నుంచి గ్రంథాలయం వరకు రోడ్డు నిర్మించకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. వివిధ పార్టీల నేతలు రాఘవరెడ్డి, హన్మంత్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సత్యనారాయణ, రాజిరెడ్డి అర్జున్, వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి

జవహర్‌నగర్: డంపింగ్‌యార్డు దుర్వాసనపై పరిసర ప్రాంతాల ప్రజలు పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అధికారులు రాకేష్ ఆధ్వర్యంలో జవహర్‌నగర్ డంపింగ్‌యార్డును బుధవారం స్థానికులతో కలిసి సందర్శించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డులో చెత్త రోజురోజుకు పేరుకుపోతుందని, సరైన పద్ధతిలో వినియోగించటం లేదన్నారు. చెత్తను క్యాపింగ్ చేసిన తర్వాత దానిపై తిరిగి చెత్త వేయడంతోనే తీవ్రమైన దుర్వాసన వస్తుందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చెత్తను ఎప్పటికప్పుడు క్యాపింగ్ చేయాలని, త్వరలోనే రాంకీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి

సాక్షి,మేడ్చల్ జిల్లా: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవడంతో పాటు చట్టం ద్వారా ప్రయోజనం పొందాలన్నదే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశమని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. ఆర్టీఐ–2005 వారోత్సవాలలో భాగంగా బుధవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో సమాచార హక్కు చట్టం -2005పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ చట్టం ఏర్పడి 20 ఏళ్లు అవుతుందని, ఈ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు పరచడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సదస్సులు, సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర కమిషన్ నిర్ణయించిందని కలెక్టర్ స్పష్టం చేశారు. బస్తీ ,డివిజన్,వార్డు, మండల, రెవెన్యూ డివిజన్, జిల్లా స్థాయిలలో అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్లు

- ప్రతి డిపార్ట్‌మెంట్ చేసే పనులు ప్రజలకు తెలపాల్సిన అవసరం ఉందని, అందుకోసం క్రియాశీలమైన సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ చట్టం అమలు ద్వారా అవినీతి తగ్గుతుందన్నారు. జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికగుప్తా మాట్లాడారు. ఈ సందర్భంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కో- ఆపరేటివ్ అధికారి వెంకట్‌రెడ్డి పీపీటీ ద్వారా సమాచార హక్కు చట్టం -2005పై ఏపీఐఓ, పీఐఓలకు అవగాహన కల్పించారు. డీఆర్‌ఓ హరిప్రియ, ఏఓ రామ్మోహన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఏపీఐఓ, పీఐఓలు పాల్గొన్నారు.

ఆదాయంపై ఫోకస్ !

- పురపాలికల్లో ఆస్తులకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి
- పునరుద్ధరించుకోకపోతే జరిమానా విధించే అవకాశం
- రహదారి విస్తరణకు వాణిజ్య సముదాయాల కొలతలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: అర్బన్, సెమీ అర్బన్‌గా అభివృద్ధి చెందిన నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పురపాలికల్లో వ్యాపార లైసెన్సు రుసుం ద్వారా ఆదాయం పెంచుకోవడానికి అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. గత కొన్నేళ్లుగా దీనిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించకపోవడంతో బల్దియాల ఆదాయానికి గండి పడిందని భావిస్తున్న అధికారులు ప్రస్తుతం వాణిజ్య, మిశ్రమ వినియోగ (గృహం, వాణిజ్య భవనం కలిసి ఉన్నవి) ఆస్తుల ప్రకారం ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి చేశారు.

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 16 పురపాలక సంఘాల పరిధిలో 18,056 వ్యాపార, వాణిజ్య సంస్థలు ఉండగా.. క్షేత్రస్థాయిలో 8,032 దుకాణాలకు మాత్రమే లైసెన్స్‌లు ఉన్నట్లు వార్డు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది.

10,645 దుకాణాలకు 3,825 లైసెన్సులు..

జిల్లా పరిధిలోని బోడుప్పల్, నిజాంపేట్, జవహర్‌నగర్, దుండిగల్, కొంపెల్లి, నాగారం పురపాలికల్లో మొత్తంగా 10,645 వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉండగా.. 3,825 వాటికి మాత్రమే ట్రేడ్ లైసెన్సులు ఉన్నట్లు మున్సిపల్‌శాఖ గుర్తించింది. మిగతా 7,058 వ్యాపార సముదాయాలకు ట్రేడ్ లైసెన్సులు జారీ చేయలేదని తెలుస్తోంది. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 2035 వ్యాపార సముదాయాలు ఉండగా.. ట్రేడ్ లైసెన్సులు పొందిన దుకాణాలు (షాపులు) 455 మాత్రమే ఉన్నాయి. నిజాంపేట నగర పాలక సంస్థలో 4354కు 2135కు లైసెన్స్‌లు తీసుకున్నారు.

– జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో 750కి 282, దుండిగల్ మున్సిపాలిటీలో 1248 కి 432, కొంపెల్లిలో 1047కి 256, నాగారంలో 1211 వ్యాపార సముదాయాలకు 265 ట్రేడ్ లైసెన్సులు ఉన్నాయి. అదే పరిస్థితి మిగతా పురపాలికల్లో నెలకొని ఉందని తెలుస్తోంది.

ఆసక్తి చూపని వ్యాపారులు..

బ్యాంకులో రుణం తీసుకున్న వారు తప్పా.. మిగతా వ్యాపార సముదాయాలకు సంబంధించిన వారంతా ట్రేడ్ లైసెన్సులు పొందటానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో పురపాలక సంఘాల ఆదాయానికి భారీగా గండి పడుతోంది. జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా పురపాలక సంఘాల్లో మరింత ఆదాయాన్ని పెంచాల్సిన అవసరం ఉంది.

అత్యధికంగా రూ.లక్ష ఫీజు

రహదారి విస్తరణ ఆధారంగా వాణిజ్య, వ్యాపార దుకాణాలకు కొలతలు తీసుకుంటున్నారు. సాధారణంగా ఒక చదరపు అడుగుకు రూ.5 చొప్పున లెక్కిస్తున్నారు. ఒక్కో దుకాణానికి వ్యాపార లైసెన్స్‌కు కనీసం రూ.200ల నుంచి అత్యధికంగా రూ. లక్ష ఉంటోంది. దీనికంటే అధిక మొత్తం వేయడానికి వీలు లేకుండా శ్లాబు విధించారు.



పునరుద్ధరించుకోకపోతే..

ఆస్తిపన్ను మాదిరిగానే ఏటా దుకాణాలకు వ్యాపార లైసెన్స్ ఫీజు చెల్లించకపోతే జరిమానా విధిస్తారు. ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేలోగా చెల్లించే వారికి ఎలాంటి అపరాధ రుసుము ఉండదు. ఆ తర్వాత పునరుద్ధరించుకోవడానికి దరఖాస్తు చేస్తే 25శాతం జరిమానా విధిస్తున్నారు.

సమస్యలు ఇవే..

ఆన్‌లైన్‌లో చూపిస్తున్న దుకాణాలు, సంస్థలు, క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. లైసెన్స్ వివరాలను ఒకసారి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత వాటిని మార్చడం అసాధ్యం. దీంతో వ్యాపారి పేరుపై ఇంటి పేరుతో ట్రేడ్ లైసెన్స్ ఛార్జీలు నమోదవుతూనే ఉన్నాయి. కొందరు వ్యాపారులు వ్యాపారంలో దెబ్బతిని కొన్నేళ్లు మూసేసి, తర్వాత కొత్తగా వ్యాపారం ప్రారంభిస్తున్నారు. కొత్త వ్యాపారానికి లైసెన్స్ తీసుకోవాలనుకుంటే పాత వ్యాపారం లైసెన్స్‌కు సంబంధించిన బకాయిలు కట్టమంటున్నారని వ్యాపారులు వాపోతున్నారు.